క్లుప్తంగా

తాబేళ్లను సంరక్షించాలని వినతి

కావలి: కావలి, బోగోలు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతానికి సంతానోత్పత్తి కోసం వచ్చే తాబేళ్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కావలిలోని కలయిక విజ్ఞాన కేంద్ర సభ్యులు, జంతు ప్రేమికులు కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిప్రతాన్ని అందజేశారు. జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని తాబేళ్ల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అటవీశాఖ అధికారులకు కూడా వినతిప్రతాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. కలయిక కన్వీనర్లు జీ రాంప్రసాద్, లావణ్య, సలహాదారు సీ శారద, సభ్యులు సాయిరాంప్రసాద్, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

పశుఆరోగ్య శిబిరం

వరికుంటపాడు: మండలంలోని తోటలచెరువుపల్లెలో పశు ఆరోగ్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లి పశువైద్యశాల వైద్యుడు రాఘవేంద్రశర్మ 112 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. దూడలు, జీవాలకు నట్టల నివారణ మందు అందజేశారు. పశువైద్య సిబ్బంది చెన్నకేశవులు, నాగేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరురూరల్: మండల నూతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కొండయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఆత్మకూరులో వీఆర్వోగా, ఆత్మకూరు, ఏఎస్‌పేట తహసీల్దార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్‌గానూ పనిచేశారు.

బ్లాక్‌స్పాట్‌ల పరిశీలన

సంగం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పెరమన వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు, ఎస్సై రాజేష్ సోమవారం పరిశీలించారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాములు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఎలుకల మందు పంపిణీ

సంగం: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి రైతులకు ఎలుకల మందు పంపిణీ చేయనున్నట్లు ఏఓ శ్రీహరి సోమవారం తెలిపారు. రైతులు సామూహికంగా ఎలుకల మందును పెట్టడం ద్వారా వాటిని నివారించవచ్చునని చెప్పారు. మండలంలో 52 కిలోల ఎలుకల మందు అందుబాటులో ఉందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

29న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సోమవారం తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ చోరీ

సోమశిల: అనంతసాగరం మండలం చాపురాళ్లపల్లి గ్రామానికి చెందిన మురుకూటి మాధవరెడ్డి పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని విలువైన రాగి తీగను అపహరించుకెళ్లారు. సోమవారం గమనించిన రైతు విద్యుత్‌శాఖ ఏఈ మురళి దృష్టికి తీసుకెళ్లగా అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు కార్లు ఢీ

సోమశిల: మండలంలోని ఉప్పలపాడు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రెండు కార్లు ఢీకొన్నాయి. పెంచలకోన వైపు నుంచి వస్తున్న కారు, సోమశిల వైపు నుంచి వస్తున్న మరో కారు ఉప్పలపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లు దెబ్బతినగా అందులోని వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సోమశిల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం



వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరపురం గ్రామానికి చెందిన వెంగమాంబ గొర్రెల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలను సోమవారం నిర్వహించారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో పశువైద్యాధికారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో 14 మంది సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా పేరం సుబ్బరాయుడుతో పాటు కమిటీ సభ్యులుగా మరో ఆరుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉదయం 11 గంటల వరకు ఖాళీగా దర్శనం ఇస్తున్న తహసీల్దార్ గది



తహసీల్దార్ రాక ఆలస్యం కావడంతో వెనుదిరిగి వెళ్తున్న లైఫ్‌సర్టిఫికెట్ల కోసం వచ్చిన వృద్ధులు



సాక్షి విజిట్

మొక్కుబడిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసింది. మండల కార్యాలయాలతో పాటు గ్రామ సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించింది. ప్రజలు విన్నవించే చాలా సమస్యలను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టింది. నేడు కూటమి ప్రభుత్వంలో మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రహసనంగా మారింది. అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉన్నా మొక్కుబడిగా కొన్ని శాఖల అధికారులు మాత్రమే పాల్గొంటున్నారు. సమయ పాలనను పాటించడం లేదు. కొద్దిసేపు మాత్రమే ఉండి వెళ్లిపోతున్నారు. భూసమస్యలపై అధికంగా అర్జీలు వస్తున్నాయి. వాటికి క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపడం లేదు. పదే పదే అర్జీలు అందజేస్తున్నా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ కనిపించారు. సోమవారం కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని మండల తహసీల్దార్ కార్యాలయాలను 'సాక్షి' విజిట్ చేయగా పలు అంశాలు వెలుగుచూశాయి.

అర్జీదారులకు తప్పని పడిగాపులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరైన అర్జీదారులు తహసీల్దార్ కోసం పడిగాపులు కాశారు. ఉదయం 9.30 గంటల నుంచే అర్జీదారులు కార్యాలయానికి రావడం ప్రారంభించారు. ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరుకావాల్సిన తహసీల్దార్ సుధీర్ 11.09 గంటలకు వచ్చారు. అప్పటికే తహసీల్దార్ కార్యాలయం వెనుకనే ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో వినతులు స్వీకరించడం ప్రారంభించడంతో సీనియర్ అసిస్టెంట్ పెంచలయ్య అక్కడకు చేరుకుని అర్జీలు స్వీకరించారు. ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని సైతం ఆత్మకూరు మండల అర్జీదారులు వచ్చిన ప్రతిసారి తహసీల్దార్ ఇంకా రాలేదా అంటూ వాకబు చేశారు. తహసీల్దార్ రావడం ఆలస్యం కావడంతో పలువురు అర్జీదారులు వెనుదిరిగి వెళ్లారు. పట్టణానికి చెందిన వృద్ధ మహిళలు లైఫ్‌సర్టిఫికెట్ల కోసం వచ్చి వెనుదిరిగారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన బండారుపల్లికి చెందిన రైతులు తహసీల్దార్ సుధీర్ ఆర్డీఓ కార్యాలయంలో ఉన్నారని తెలుసుకుని అక్కడికి వెళ్లి ఆర్డీఓ సమక్షంలో సమస్యను విన్నవించారు. కాగా ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందాయి.

రీసర్వేకు తహసీల్దార్



బిట్రగుంట: అర్జీలు స్వీకరిస్తున్న డీటీ భరత్‌కుమార్

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లిలో సోమవారం నుంచి రీసర్వే ప్రక్రియను పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టడంతో అధికారులంతా ఉదయం 9.30 గంటలకే తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, సర్వేయర్, వీఆర్వోలు, ఆర్‌ఐలు ఉదయం 10 గంటల ప్రాంతంలో రీసర్వే కోసం కోవూరుపల్లికి వెళ్లారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భరత్, ఇతర అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరించారు. అరకొరగా వచ్చిన అర్జీలు కూడా భూసమస్యలపైనే రావడంతో రీసర్వేలో పరిష్కరిస్తామని చెప్పి పంపించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టుమని పది అర్జీలు కూడా రాకపోవడంతో హాజరైన అధికారులు ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు.

స్పందన కరువు



నలుగురు సిబ్బంది మాత్రమే హాజరైన దృశ్యం

సీతారామపురం: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి స్పందన కరువైంది. తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి ఉదయం 10.20 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు కార్యాలయంలో ఉండి వెళ్లిపోయారు. వీఆర్వోలు, ఆర్‌ఐ 11 గంటల తరువాత కార్యాలయానికి చేరుకున్నారు. హౌసింగ్ ఏఈ రామకృష్ణారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్తమ్మ, ఆర్‌అండ్‌బీ శాఖ తరఫున ఓ చిరుద్యోగి మాత్రమే హాజరయ్యారు. ప్రజాసమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగానికి చిత్తశుద్ధి లేకపోవడంతో ప్రజల నుంచి కూడా స్పందన కరువైంది.

రెండు వారాలుగా తిరుగుతున్నా..



నాకు సర్వే నంబరు 34–1లో 4.05 ఎకరాల భూమి ఉంది. 2007లో పాస్‌పుస్తకాలు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో పేరు ఎక్కించాలని రెండు వారాలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదు. – **బత్తల చంటయ్య, వేంపల్లితోక గ్రామం**

సీనియర్ అసిస్టెంటే దిక్కు



అర్జీలు స్వీకరిస్తున్న సీనియర్ అసిస్టెంట్

దుత్తలూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారులందరూ హాజరుకాలేదు. తహసీల్దార్ సెలవులో ఉండడం..డీటీ పోస్టు ఖాళీగా ఉండడంతో సీనియర్ అసిస్టెంట్ సంధానిబాషా వినతులు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్, వీఆర్వో ఒకరు, కంప్యూటర్ ఆపరేటర్ పది గంటలకు కార్యాలయానికి వచ్చారు. మరో ఇద్దరు వీఆర్వోలు 10.30 గంటలకు వచ్చారు. ఆర్‌ఐ 10.55 గంటలకు చేరుకున్నారు.

ప్రహసనంగా ఫిర్యాదుల స్వీకరణ



తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.05 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

జలదంకి: మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఒక ప్రహసనంగా జరుగుతోంది. 10.30 గంటలకు విధులకు హాజరు కావాల్సిన అధికారులు, సిబ్బంది తాపీగా 11 గంటలకు హాజరయ్యారు. సోమవారం జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సాక్షి విజిట్ చేసింది. వివిధ ప్రాంతాల నుంచి అర్జీలు వచ్చినా.. తీసుకునే అధికారులు లేక.. బయట పడిగాపులు పడ్డారు. ఉదయం 10.05 గంటలకు కేవలం కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే వచ్చారు. ఆ తరువాత కొద్ది సేపటికి తహసీల్దార్ హాజరయ్యారు. 10.13 గంటలకు ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ, 10.21 గంటలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, 10.30 గంటలకు డీటీ హాజరయ్యారు. ఆ తర్వాత 11 గంటల వరకు వివిధ శాఖల అధికారులు వస్తూపోతూ ఉన్నారు. అది కూడా అరకొర శాఖల అధికారులు వచ్చారు. రావడమే ఆలస్యం.. గంట కూడా ఉండకుండా వెళ్లిపోవడం చూస్తే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎంత చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారో అర్థమవుతోంది.

వెనుదిరిగిన అర్జీదారులు



రెవెన్యూ సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు

కొండాపురం: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారులు ఆలస్యంగా రావడంతో అర్జీదారులు వెనుదిరిగారు. ఉదయం 10 గంటలకే అర్జీదారులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు సీనియర్ అసిస్టెంట్ మాత్రమే కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ కోటేశ్వరరావు 10.45 గంటలకు వచ్చారు. డీటీని డిప్యుటేషన్‌పై రామాయపట్నం పోర్టుకు వేశారు. తహసీల్దార్ రావడం ఆలస్యం కావడంతో కొద్దిసేపు నిరీక్షించిన అర్జీదారులు వెనుదిరిగి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పరిశీలించిన జూనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐలు రాలేదు. ఆర్‌ఐ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యేందుకు కలిగిరి వెళ్లారని, జూనియర్ అసిస్టెంట్ అనారోగ్యంతో సెలవు పెట్టారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కోర్టు పనిపై వెళ్లిన తహసీల్దార్



అర్జీలు స్వీకరిస్తున్న డీటీ

చేజర్ల: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు తహసీల్దార్ మురళి హాజరుకాలేదు. ఆయన కోర్టు పని నిమిత్తం విజయవాడకు వెళ్లినట్లుగా కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉదయం 10 గంటలకే డీటీ మస్తానయ్య కార్యాలయానికి చేరుకున్నారు. మిగిలిన అధికారులు 11 గంటల వరకు వస్తూ కనిపించారు. తహసీల్దార్ రాకపోవడంతో డీటీనే అర్జీలను స్వీకరించారు. నాగులవెలటూరుకు చెందిన చంద్రమౌళి ఆధార్ కార్డులో పేరు మార్చాలని, చేజర్లకు చెందిన ఉడతా సాగర్‌కుమార్ తన ఇంటికి దారి చూపించాలని, చిత్తలూరుకు చెందిన భాస్కర్ నాయుడు తన పొలానికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు.

భూసమస్యలపై వినతుల వెల్లువ

అనుమసముద్రంపేట: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీరామకృష్ణ ఉదయం 10.20 గంటలకు కార్యాలయానికి చేరుకోగా, మిగిలిన అధికారులు కొంచెం ఆలస్యంగా వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల వరకు తహసీల్దార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలపై ఏడుగురు అర్జీలు అందజేశారు.

స్పందన కరువు



అల్లూరు: వీడియో కాన్ఫరెన్స్‌లో డీటీ

అల్లూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీదారుల నుంచి స్పందన కరువైంది. తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆరోగ్యం బాగాలేక సెలవు పెట్టారు. దీంతో ఒక్క అర్జీదారుడు కూడా కార్యాలయానికి రాలేదు. డీటీ ప్రవీణ్‌కుమార్ ఉదయం 9.45 గంటలకు కార్యాలయానికి చేరుకుని వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. మిగిలిన అధికారులు 10.30 గంటలకు వచ్చారు.

తహసీల్దార్ ఒక్కరే..



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుభాషిణి

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఆరు అర్జీలు అందాయి. తహసీల్దార్ సుభాషిణి ఉదయం 10 గంటలకే కార్యాలయానికి వచ్చారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై వినతులను స్వీకరించారు. భూసమస్యలపై ఆరుగురు అర్జీలను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన సిబ్బంది అందరూ విధులకు హాజరయ్యారు.

ఆలస్యంగా తహసీల్దార్ రాక



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రవీంద్రబాబు

కలిగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై ఐదుగురు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు ఆలస్యంగా ఉదయం 10.40గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. తూర్పుదూబగుంట గ్రామానికి చెందిన వీరంరెడ్డి పెదమస్తాన్‌రెడ్డి తనకున్న 0.40 సెంట్ల భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకంలో సర్వే నంబర్ తప్పుగా నమోదైందని, సరిచేయాలని వినతిపత్రం అందజేశారు.

నాలుగే అర్జీలు



సంగం: మండలం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యలపరిష్కారవేదికకు భూసమస్యలపై నాలుగు అర్జీలే అందాయి. ఉదయం 10.30 గంటలకు డిప్యూటీ తహసీల్దార్ హాజరయ్యారు. 10.35 గంటలకు తహసీల్దార్ సోమ్లానాయక్ హాజరై వినతులు స్వీకరించారు.

ప్రభుత్వ ఉద్యోగినంటూ మోసం

అల్లూరు: ప్రభుత్వ ఉద్యోగినంటూ ఓ యువకుడు ప్రజలను మోసం చేసి ఉడాయించిన ఘటన మండలంలోని ఆదినారాయణపురంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆదినారాయణపురం గ్రామానికి ఆదివారం ఓ యువకుడు వచ్చాడు. తనపేరు మహేష్ అని, కావలి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తూ అల్లూరు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చానని మత్స్యకారులకు నమ్మబలికాడు. పిల్లలకు జనన ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తదితరాలు చేస్తానంటూ గ్రామస్తుల నుంచి నగదును వసూలు చేశాడు. గ్రామస్తుల్లో కొందరికి అనుమానం వచ్చి తహసీల్దార్ కార్యాలయంలోని వారికి ఫోన్ చేసి ఆరా తీయగా, మహేష్ అనే పేరుతో ఎవరూ లేరని బదులిచ్చారు. ఈ లోగా సదరు వ్యక్తి ఏపీ39ఎఫ్‌డబ్ల్యూ5946 నంబర్ బైక్‌పై ఉడాయించాడు. ఈ విషయమై తహసీల్దార్ నారాయణను వివరణ కోరగా తహసీల్దార్ కార్యాలయంలో మహేష్ అనే పేరు గల వ్యక్తి ఎవరూ పనిచేయం లేదని తెలిపారు. కాగా ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి చొరవ చూపాలి

కొండాపురం: గ్రామాల అభివృద్ధికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని ఎంపీపీ బొడ్డు అనూరాధ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, సిమెంటు రోడ్లు, తదితర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం మండలాధికారులు శాఖల వారీగా జరిగిన, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఆదినారాయణ, ఎంఈఓ రవికుమార్, ఏఓ శేషసాయి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో తనిఖీలు

ఉదయగిరి: ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ చెరుకూరి శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. తొలుత వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ టీ గోపీకృష్ణతో కలిసి అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అనంతరం పుట్టగొడుగుల పెంపక కేంద్రాన్ని, కళాశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. కళాశాల విభాగాధిపతులు రఘునాథ్‌రెడ్డి, ఏవీఎస్.దుర్గాప్రసాద్, ఎం కిషన్, జీ రమేష్, తేజ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులోని గంగవరపు వెంకటసుబ్బయ్య అనే రైతుకు చెందిన పొగాకు బ్యారెన్ సోమవారం దగ్ధమైంది. పొగాకు క్యూరింగ్ చేస్తుండగా గొట్టాలపై ఆకులు పడి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.3.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఉదయగిరి: ఉదయగిరిలోని ఎరువుల దుకాణాలను నెల్లూరుకు చెందిన ఏడీఏ శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని సూచించారు. నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ ఆంజనేయులునాయక్ ఉన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించండి

సంగం: ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీడీఓ షాలెట్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నుల వసూలు, పారిశుధ్యంపై సమీక్షించి సూచనలు చేశారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి



వరికుంటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై



కలిగిరిలో విద్యార్థుల మానవహారం

సీతారామపురం: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణాలు సాగించాలని ఉదయగిరి సీఐ వెంకట్రావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సీతారామపురంలోని ఎల్‌వీఆర్ కళాశాల వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్టులను విధిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఎస్సై శ్రీనివాసులు, ఏఎస్సై వెంకటసుబ్బయ్య, పోలీసులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. సీఐ పీ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్, బీమా, డ్రైవింగ్ లైసెన్స్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



కలిగిరిలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్మించిన పోలీసులు